ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అసంతుష్ట నేతలతో అధిష్టానం చర్చించాలి: ఈశ్వరప్ప

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బెళగావిలో భేటీ అయిన అసంతృప్తి నేతలతో అధిష్టానం వెంటనే చర్చించాలని, లేనిపక్షంలో పార్టీలో చీలికలు తారస్థాయికి చేరుతాయని మాజీ మంత్రి ఈశ్వరప్ప తెలిపారు. శివమొగ్గలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రమేశ్ జార్కిహొళితోపాటు 12 మంది ప్రముఖులు సమావేశమయ్యారన్నారు. పార్టీకోసం జీవితకాలం పనిచేసిన వారు ఎన్ని బాధల పడుతున్నారనేది అర్థమవుతోందన్నారు. అధిష్టానం నిర్ల క్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. వారు పాదయాత్ర చేస్తే మరి న్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు.

ప్రాజెక్టులు భద్రమేనా..?



భద్ర ప్రాజెక్టు



కేఆర్ఎస్

భద్ర ప్రాజెక్టులో గేట్లు జామ్
రోజూ 300 క్యూసెక్కులు వృథా
ఐదు దశాబ్దాలు దాటిన వాటిపై ఆందోళన
స్థితిగతులపై నిపుణుల కమిటీ: డీసీఎం

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం 19వ క్రెస్టుగేట్ చెయిన్ లింక్ తెగిపోవడంతో భారీ ప్రమాణంలో నీరు వృథా అవుతోంది. దేశవ్యాప్తంగా రెండు రోజులుగా తుంగభద్ర ప్రాజెక్టు చర్చనీయాంశమవుతోంది. ఇదే తరుణంలో రాష్ట్రంలోని జలాశయాల గేట్లు, నిర్మాణాల సురక్షత, పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిక్కమగళూరు జిల్లాలోని భద్ర ప్రాజెక్టుకు సంబంధించి జూన్ చివరి వారంలో నదీ స్థాయిలో ఉండే స్లూయిస్‌గేట్ జామ్ కావడంతో భారీగా నీరు నదికి వదిలారు. అధికారులు గేట్ల పరిశీలన కోసం ట్రయల్‌రన్ చేస్తుండగా తుప్పుపట్టిన రెండు స్లూయిస్‌గేట్‌లు మూతపడకుండా జామ్ అయ్యాయి. దీంతో ప్రతిరోజూ 5వేల క్యూసెక్కులకుపైగా నీరు నదివైపు వెళ్తోంది. ఇలా 15రోజులుగా కొనసాగుతోంది. స్థానిక కార్మికులు ప్రత్యామ్నాయ వ్యవస్థ ద్వారా తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికీ రోజూ సుమారు 300 క్యూసెక్కుల నీరు నదిపాలవుతోంది. ఆరేళ్లక్రితం భద్ర ఎడమ కాలువ గేట్ జామ్ అయింది. దానిని మరమ్మతులు చేసేందుకు ఐదు సార్లు రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేశారు.

అయినా ఇప్పటికీ ఏటా 150 క్యూసెక్కుల నీరు వృథా అవుతూనే ఉంది. ఇక నారాయణపుర ప్రాజెక్టుకు సంబంధించి క్రెస్ట్ గేట్లు 2005లో జామ్ కావడంతో భారీగా నీరు వృథా అయింది. వారం రోజుల తర్వాత వాటికి మరమ్మతులు చేశారు. రాష్ట్రంలోని ప్రధానమైన ప్రాజెక్టులన్నీ నిర్మాణాలు జరిగి దాదాపు 50-70 ఏళ్లు దాటాయి. ప్రారంభంలో అమర్చిన గేట్లు, చెయిన్ లింక్‌ల నిర్వహణ సమగ్రంగా పర్యవేక్షించకపోవడం లేదా సమసిపోవడం, తుప్పుపట్టడం వంటివి జరగడం సహజం. నీటి లీకేజీలు భారీ స్థాయిలో జరుగుతున్నా పర్యవేక్షించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఏటా ప్రాజెక్టుల గేట్లను పరిశీలించడం అనివార్యం. అందుకోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయినా నాణ్యత విషయంలో తరచూ విమర్శలు వస్తుంటాయి. నియమితమైన నిర్వహణ లేకుంటే కోట్లాదిరూపాయలు ఖర్చు అవుతుంటాయి. లీకేజీలు ఉన్న జలాశయాల్లో నీటి లోపలికి దిగి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ముంబైలోని ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ సంస్థ అండర్‌వాటర్ డైవింగ్ ప్రమాణ పత్రాలు కల్గిన కాంట్రాక్టర్లకు మాత్రమే పనులు ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఇటీవల నకిలీ పత్రాలు పొందినవారి ద్వారా కాంట్రాక్టర్లు పనులు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. నీళ్లలోపల మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. నీటి లోపల మరమ్మతులు చేశారా..? అది నాణ్యమైనదేనా..? అనే విషయం ఎవరికీ కనిపించదు. అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. భద్ర జలాశయంలో పదేళ్ల కిందట ఇటువంటి సమస్య తలెత్తింది. నిర్మాణాలు పారదర్శకత లేకపోవడం, అవినీతి వంటి అంశాలు కూడా భారీ పరిణామాలకు కారణమవుతున్నాయి. కబిని జలాశయం ఎడమకాలువ స్లూయిస్ వాల్‌లో మూడేళ్లుగా లీకేజీలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై నిపుణుల కమిటీ లీకేజీ కారణంగా ప్రాజెక్టు సురక్షితానికి ఎటువంటి ప్రమాదం లేదని సూచించారు. సీసీటీవీ అమర్చి లీకేజీ విధానాన్ని పరిశీలిస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గితే ఫిబ్రవరి లేదా మే నెలల్లో మరమ్మతులు చేపట్టే అవకాశం ఉంది.

కేఆర్ఎస్ పరిధిలో నిరంతరం బ్లాస్టింగులు

కావేరి నదికి అనుబంధమైన ప్రాజెక్టులలో కేఆర్ఎస్ కీలకమైనది. డ్యామ్ చుట్టూ 2018 నుంచి నిరంతరంగా బ్లాస్టింగులు కొనసాగుతున్నాయి. స్థానికులు గనుల తవ్వకాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మండ్య మాజీ ఎంపీ సుమలత బ్లాస్టింగులను నిలిపివేయాలని చేసిన పోరాటానికి రాజకీయంగా వ్యతిరేకత వచ్చింది. ఒకానొక దశలో కేఆర్ఎస్‌లో పగుళ్లు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో నిపుణుల కమిటీ పరిశీలించి లేవని నిర్ధారించింది.

ప్రాజెక్టుల స్థితిగతులపై నిపుణుల కమిటీ: డీసీఎం



రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల స్థితిగతులపై ప్రత్యేక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి పరిశీలింప చేస్తామని జలవనరుల శాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ గేట్‌ను మళ్లీ అమర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 19వ గేట్ చెయిన్ లింక్ తెగిపోవడంతో శుక్రవారం రాత్రి నుంచి నీరు వృథా అవుతోందన్నారు. నాలుగైదు రోజుల్లో మరమ్మతులు చేపడతామన్నారు. 70ఏళ్ల వ్యవధిలో తొలిసారి ఇటువంటి సంఘటన చోటు చేసుకుందని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అన్ని ప్రాజెక్టుల స్థితిగతులపై నిపుణుల కమిటీ ద్వారా పరిశీలన జరిపిస్తామన్నారు. అవసరమైతే అప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



కబినీ జలాశయం



జయదేవ ఆసుపత్రి అండర్‌పాస్‌లో నిలిచిన నీరు, సహాయక చర్యలు

నగరాన్ని వణికించిన వర్షం

రోడ్లు జలమయం... లే అవుట్‌లలోకి నీరు

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలను భారీ వర్షం వణికించింది. ఆదివారం రాత్రి 2 గంటలకు ప్రారంభమైన వర్షం తెల్లవారు దాకా కురిసింది. అమృతహళ్లి మునిస్వామప్ప లే అవుట్‌లోని ఇళ్లలోకి నీరు చేరింది. కేఆర్ మార్కెట్‌లో భారీ వర్షంతో కూరగాయలు, ఆకుకూరల విక్రయాలకు అంతరాయం కలిగింది. లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. బీటీఎం లే అవుట్, బసవనగుడి, శాంతినగర్, కామాక్షిపాళ్య, యశ్వంతపుర తోపాటు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. బీటీఎం లే అవుట్ రెండో స్టేజ్‌లో అన్ని రోడ్లు జలావృతమయ్యాయి. చెన్నై - బెంగళూరు జాతీయ రహదారి, సిల్క్‌బోర్డ్, ఎలక్ట్రానిక్‌సిటీ రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చిక్కపేట మెట్రో స్టేషన్ ఎదుట భారీగా నీరు చేరడంతో ఇబ్బంది పడ్డారు. సుల్తాన్‌పేట, బళెపేట, చిక్కపేట ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో ఉదయం ప్రజలు ఇబ్బంది ఎదుర్కొన్నారు. నగరంలో 24 గంటల వ్యవధిలో అత్యధికంగా కొడిగేహళ్లిలో 61.55 మి.మీ. వర్షపాతం నమోదు కాగా వీవీపురంలో 57.5 మి.మీ., విద్యాపీఠలో 56, నాయండహళ్లిలో 55, హగదూరులో 54, ఆర్‌ఆర్‌నగర్‌లో 53, హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్ 50, రాజరాజేశ్వరినగర్‌లో 50.5, పులకేశినగర్‌లో 48.5, యలహంక 49, దొడ్డనెక్కుంది 48 మి.మీ. వర్షం కురిసింది. సరాసరిన 52 మి.మీ. వర్షం కురిసినట్టు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

ఉపాధ్యాయుల నిరసన

రాష్ట్రమంతటా పాఠశాలల బంద్



ఫ్రీడంపార్కులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు, బదిలీల విషయంలో ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నిరసనకు దిగారు. ఫ్రీడంపార్కులో సోమవారం వేలాదిమంది ఉపాధ్యాయులు నిరసనలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు నిరసనలో పాల్గొన్న పరిణామంతో రాష్ట్రమంతటా పాఠశాలలు దాదాపు మూతపడ్డాయి. మంత్రి మధుబంగారప్ప ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు.

త్వరలోనే మంత్రివర్గ విస్తరణ

ఐదుగురికి ఉద్వాసన..?

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలోనే మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేయాలని అధిష్టానం సూచించినట్టు తెలుస్తోంది. ఐదుగురిని కేబినెట్ నుంచి తొలగించి ఆరుగురి ద్వారా భర్తీ చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఆప్తుడిగా ముద్ర పడిన నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, అబ్కారి మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర, సహకారశాఖ మంత్రి రాజణ్ణ, ప్రజా పాలన, హజ్‌శాఖ మంత్రి రహీం ఖాన్‌ను తొలగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నాగేంద్ర రాజీనామాతో ఒక స్థానం ఖాళీగా ఉంది. వీటితో కలిపి ఆరు స్థానాలు భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే భద్రావతి ఎమ్మెల్యే సంగమేశ్‌కు కేబినెట్‌లో చోటు ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా భద్రావతిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణ జరిగితే సంగమేశ్ మంత్రి అవుతారన్నారు.


యడియూరప్ప పోక్సో కేసులో ట్విస్ట్..?

- హైకోర్టు ఆదేశాల రద్దుకు సర్కార్ కసరత్తు


బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) అవినీతి కేసులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా కోరుతూ బీజేపీ-జేడీఎస్ పాదయాత్రతోపాటు నిరంతరంగా పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ సీనియర్ నేత యడియూరప్పపై దాఖలైన పోక్సో కేసులో ట్విస్ట్ ఇవ్వనున్నట్లు సమాచారం. యడియూరప్ప అరెస్టుకు హైకోర్టు స్టే విధించింది. సదరు స్టేను రద్దు చేయించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఆ దిశగా న్యాయనిపుణులకు సూచనలు చేసినట్టు సమాచారం. ఇప్పటికే గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త టీజే అబ్రహాంపై పెండింగ్ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. తాజాగా యడియూరప్పపైనా పోక్సో కేసును తిరగతోడేందుకు సిద్ధమయ్యారు. రెండు రోజుల కిందట సీఎం సిద్దరామయ్య బీజేపీ నాయకుల పట్ల కనికరం చూపేది లేదని ప్రకటించిన వెంటనే ఈ అంశాలు తెరపైకి రావడం కీలకమైంది.



ఆయకట్టు రైతు కన్నీరు



అన్నదాతకు కోలుకోలేని దెబ్బ
తుంగభద్ర కింద ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 7.27 లక్షల హెక్టార్ల సాగు
రూ. కోట్లల్లో నష్టపోయిన రైతులు



బళ్లారి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల జీవనాడి తుంగభద్ర జలాశయం నీరు కళ్లెదుటే నదిలో కలిసిపోతుంటే రైతులు కన్నీరు పెడుతున్నారు. రెండు రాష్ట్రాల్లో 7.29 లక్షల హెక్టార్లకు సాగు నీరు అందించే తుంగభద్ర జలాశయం, రెండు రాష్ట్రాల పరిధిలోని దాదాపు ఆరు జిల్లాల్లో ఉండే అనేక గ్రామాల ప్రజలకు తాగునీటిని అందిస్తోంది. ఊహించని ప్రమాదంతో నీరంతా వృథాగా కడలిపాలవుతోంది. డ్యాం నిండా నీరు చేరింది, ఇక పంటల సాగుకు ఎలాంటి ఢోకా లేదని వరినార్లకు సిద్ధమవుతున్న రైతులు ఊహించని పరిణామంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇప్పుడు ఏమి చేసేది అని రైతులు కన్నీరు కారుస్తున్నారు. తుంగభద్ర జలాశయాన్ని కర్ణాటకలోని విజయనగర (హొస్పేట్) వద్ద సుమారు 382 కిలోమీటర్ల వైశాల్యంతో నిర్మాణం చేశారు. ఖరీఫ్‌తో పాటు రబీలోనూ కొంత ప్రాంతానికి నీరు పారే విధంగా రూపకల్పన చేశారు. రెండు రాష్ట్రాల్లోని సుమారు ఆరు జిల్లాల్లోని పలు గ్రామాలకు జలాశయం నీరే దిక్కు. తుంగభద్ర డ్యాం నిర్మాణం జరిగి సుమారు 70 ఏళ్ల కాలం కావస్తున్నా ఏనాడూ నీటికి కొరత లేదు. కరువు కాలం వచ్చినా తుంగభద్ర ఖరీఫ్ సాగుకు, తాగునీటికి ఏనాడూ ఇబ్బంది కలిగించలేదని రైతులు చెబుతున్నారు. ఈఏడాది ఊహించని విపత్తు తరుముకొచ్చింది. క్రస్ట్ గేటు తెగి డ్యాంలో ఉండే నీరంతా కడలిపాలవుతోంది. డ్యాం నీటి మట్టం 1633 అడుగులు, పూడిక కారణంగా నీటి నిల్వ సామర్థం తగ్గిపోయింది. 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి చేరింది. ప్రస్తుతం ఏడాది సామర్థం ప్రకారం నీరు డ్యాంలో చేరాయి. అధికారులు కూడా ఈఏడాది 202 టీఎంసీలు నీరు డ్యాంకు వస్తాయి, ఇందులో 172 టీఎంసీలు నీరు వినియోగించుకుంటామని లెక్కలు వేశారు. అనుకున్నట్లే నీళ్లు వచ్చాయి. విధి వేరే రకంగా వెక్కిరించింది. డ్యాంలో ఉండే నీరంతా కిందకు వెళ్లిపోతోంది. డ్యాంలో కనీసం 65 టీఎంసీల నీరు కిందకు వదిలి కేవలం 40 లేదా 45 టీఎంసీల నీరు నిల్వ ఉంటేనే క్రస్ట్ గేటు అమర్చేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. వారం గడిస్తే 40 టీఎంసీలు మాత్రమే నీరు ఉంటుంది. తర్వాత వర్షాలపై ఆధార పడాలి. తర్వాత వస్తాయో రావో చెప్పలేని పరిస్థితి. అలాంటప్పుడు తుంగభద్ర డ్యాంలో ఉండే 40 టీఎంసీలు నీరు తాగు, సాగు నీటికి వినియోగించుకోవడం సాధ్యమవుతుందా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం కింది ఉండే ఆయకట్టు భూముల్లో రైతులు వరి, మిరప, ఇతర పంటల సాగుకు నార్లు వేసుకున్నారు. వాటికి నీరు అందక ఎండిపోతున్నాయి. ఇప్పటికే రైతులు పెట్టుబడుల కింద రూ. కోట్లల్లో ఖర్చు చేశారు. పంటలు పండని కారణంగా కూడా రూ. కోట్లల్లోనే నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా పాపం ఎవరిదో.. శాపం మాత్రం రైతులకు తగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే క్రస్ట్‌గేటుకు ప్రమాదం

రైతులకు హెక్టారుకు రూ.50 వేలు పరిహారమివ్వాలి: బీజేపీ

బళ్లారి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేటు తెగిపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యం ఉందని, గత నాలుగేళ్ల క్రితమే క్రస్ట్ గేట్లు పరిశీలించి నివేదిక ఇచ్చిన ఇంజనీర్ల మాటను ఎందుకు పాటించలేదని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రశ్నించారు. సోమవారం టీబీడ్యాం క్రస్ట్ గేటును బీజేపీ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, విధానసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర కలిసి పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడారు. అనంతరం తుంగభద్ర అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల రైతులకు జీవధారం అయిన తుంగభద్ర ప్రమాదంలో పడడం బాధాకరం అన్నారు. క్రస్ట్ గేటు తెగిపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు హెక్టారుకు రూ. 50 వేల నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రసుత్తం క్రస్ట్ గేటు ఏ నమూనా ప్రకారం అమర్చుతున్నారో వంటి వివరాలన్నీ చెప్పాలన్నారు. వెంటనే క్రస్ట్ గేటు అమర్చి నీరు వృథాకాకుండా ఆపాలన్నారు. నాయకులు అశోక్, విజయేంద్ర మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని, ఇందుకు బాధ్యులైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బసవరాజ్ బొమ్మై, ఇతర నాయకులు

ఏనుగులను రక్షించుకోవాలి

మనుషులు, ఏనుగుల మధ్య పెరుగుతున్న ఘర్షణ
ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల రక్షణ అందరి బాధ్యత అని, ఇటీవల ఏనుగులు, మానవుల సంఘర్షణలు పెరుగుతున్నాయని, అందుకు అటవీ ప్రాంతాల్లోకి చొరబాట్లే కారణమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గాంధీ కృషి విజ్ఞాన కేంద్రంలో మానవులు, ఏనుగుల ఘర్షణకు సంబంధించి అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఏనుగులు అటవీ ప్రాంతాల్లో నివాసం ఉంటాయని, వాటి సంరక్షణతోపాటు దాడులు, ఇతరత్రా అంశాలపై సమగ్ర చర్చలు అవసరమని అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ, సామాజిక, ఆర్థిక పరిణామాలపైనా చర్చలు జరగాల్సి ఉందన్నారు. ప్రజలు ఏనుగులతో వేలాది సంవత్సరాలుగా సమన్వయంతో జీవిస్తున్నారని గుర్తుచేశారు. సరిహద్దులు దాటడం, అభివృద్ధి పేరిట అటవీ ప్రాంతాల్లోకి చొరబాట్లు, వాతావరణంలో మార్పులు వంటి కారణాలతో మనుషులు, ఏనుగుల మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయన్నారు. నగరీకరణ, వ్యవసాయం, అడవుల నాశనం, జాతీయ రహదారులు, గనుల తవ్వకాలు వంటి పరిణామాలతో ఏనుగులు తమ పరిధిని దాటి వస్తున్నాయన్నారు. రైల్వే పట్టాల వంటివి అడ్డుగా అమర్చినా అధిగమించి వెళ్తున్నాయని తెలిపారు. వాతావరణంలో మార్పులతో ఏనుగులకు అవసరమైనంత ఆహారం లభించకపోవడంతో అడవులను దాటి పంట పొలాలు, నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయని అన్నారు. దేశంలో 2017 గణాంకాల ప్రకారం 30వేల ఏనుగులు ఉంటే అత్యధికంగా రాష్ట్రంలో 6,395 ఉన్నాయని వివరించారు. వన్యప్రాణుల రక్షణ మనుషులపైనే ఆధారపడి ఉందన్నారు. పదేళ్లలో ఏనుగులు 2500కు పైగా దాడులు చేయగా 350 మంది మృతి చెందారని తెలిపారు. భారీ స్థాయిలో పంటనష్టం జరిగిందన్నారు. సంఘర్షణలను ఏ విధంగా నియంత్రించాలన్నదే ముఖ్యం కావాలన్నారు. ఏనుగులు - మనుషుల సంఘర్షణ తగ్గాల్సి ఉందన్నారు. వీటిపై రూ.150 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. 300 కిలోమీటర్ల మేర రైల్వేబారికేడ్లు, 800 కి.మీ. మేర సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 2015-16లో రైల్వేబారికేడ్ ప్రాజెక్టు ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో 8 ప్రత్యేకమైన ఏనుగుల క్యాంప్‌లు ఉన్నాయని తెలిపారు. 1200కు పైగా ఏనుగుల దాడులను నియంత్రించామన్నారు. అంతర్జాతీయ సదస్సులో పరస్పర అవగాహన ఆధునిక సాంకేతిక పరిష్కారాలపై చర్చలు జరుగుతాయన్నారు.



అటవీ సిబ్బంది ఉపయోగించే తుపాకీని ఎక్కుపెట్టిన సీఎం



సదస్సు ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య, అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె తదితరులు



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.97	1,628.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	25,571	12,560
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	99,567	11,392
సామర్థ్యం (టీఎంసీలు)	97.75	89.26

పంటలపై అడవిపందుల దాడి



హరప్పనహళ్లిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

కంప్లి, ఆగస్టు 12: ఎండనక, వాననక రైతులు పండించిన రైతులు పండించిన పంటలను అడవిపందులు ధ్వంసం చేస్తున్నాయి. విజయనగరం జిల్లా హరప్పనహళ్లి తాలూకా పరిధిలోని కొండప్రాంతాల చుట్టూ ఉండే మొక్కజొన్న పంటలపై అడవిపందులు దాడి చేశాయి. దీంతో పంటను నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హనుమనాయకనహళ్లి, బెట్టనూరు, తాండనూరు తదితర ప్రాంతాల్లో సాగు చేస్తున్న పంటలపై అడవిపందుల దాడులు ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు కొండప్రాంతంచుట్టూ లైట్లు, కంచె ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

సిరుగుప్ప, ఆగస్టు 12: తాలూకాలోని సిరిగేరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, ప్లేట్లు, గ్లాసులను సమాజ సేవకులు లక్ష్మణ్ణ, న్యాయవాది రాంబాబు, మహమ్మద్ రఫీక్ సోమవారం పంపిణీ చేశారు. ఎల్‌కేజీ, విద్యాప్రగతికి తాము కృషి చేస్తామన్నారు.

వీధికుక్కల పట్టివేత

కంప్లి, ఆగస్టు 12: హోస్పేట పట్టణంలోని వీధికుక్కలను నగరసభ సిబ్బంది పట్టుకుంటున్నారు. పట్టణంలో ఇటీవల ప్రజలపై కుక్కలు దాడులు ఎక్కువ కావడంతో నగరసభకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కుక్కలను పట్టివేయాలని ప్రజలు కోరుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం నగరసభ సిబ్బంది కుక్కలను పట్టివేశారు. వీధికుక్కలు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని తెలియజేశారు. అదేవిధంగా పట్టణంలో మాంసం విక్రయించే అంగళ్ల ముందు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంది సూచించారు. లేనిపక్షంలో షాపుల అనుమతులను రద్దుచేస్తామన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న అధికారి

కంప్లి, ఆగస్టు 12: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిందాల్ విజయనగర విమానాశ్రయ భద్రత శాఖ అధికారులు తెలిపారు. సోమవారం జిందాల్ వి మానాశ్రయ ప్రాంగణంలో పోలీసు శాఖ, విమానయాన శాఖ అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

విజయవంతం చేద్దాం

సిరుగుప్ప, ఆగస్టు 12: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సమాజ సేవకుడు అబ్దుల్ నబీ కోరారు. సోమవారం సిరుగుప్ప పట్టణ హెడ్‌పోస్టాఫీసు కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు ప్రతిఇంటిపై త్రివర్ణపతాకాన్ని ఎగురవేయాలన్నారు. తద్వారా దేశభక్తిని చాటాలన్నారు. పోస్టల్ కార్యాలయంలో జాతీయజెండాను రూ. 25కు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్‌పోస్ట్‌మాస్టర్ మంజునాథ శెట్టి, మహమ్మద్ నౌషద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించండి

లోకాయుక్త సీఐ రఫిక్



లోకాయుక్త అధికారులకు సమస్యలు తెలియజేస్తున్న ప్రజలు

కంప్లి, ఆగస్టు 12: వివిధ సేవలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని లోకాయుక్త సీఐ మహమ్మద్ రఫిక్ సూచించారు. కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో లోకాయుక్త అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని పరిష్కారం దిశగా అధికారులు ముందుకుసాగాలన్నారు. అనంతరం వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందించారు. రేషన్, పింఛన్, అక్రమ కట్టడాలు తదితర సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. అనంతరం నారాయణస్వామి ఏపీఎంసీలో అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డును, ఎలాంటి అనుమతులు లేకున్నా నిర్మించిన కట్టడాలను పరిశీలించారు. అక్కడ నుంచి పురసభ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శివరాజు, ఈఓ శ్రీకుమార్, ముఖ్య అధికారి దుర్గన్న, షణ్ముకప్ప, డాక్టర్ బసవరాజు, ఎక్సైజ్ అధికారి ఉష తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ చాన్స్‌లర్ తిప్పేరుద్రప్ప

బళ్లారి సిటీ, ఆగస్టు 12: ర్యాగింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తిప్పేరుద్రప్ప అన్నారు. సోమవారం యూనివర్సిటీ ఆవరణలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చాన్స్‌లర్ మాట్లాడుతూ ర్యాగింగ్ క్షమించరాని నేరమన్నారు. ర్యాగింగ్ చేసిన, ప్రేరేపించిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ర్యాగింగ్ మహమ్మారిని పారదోలేందుకు విద్యార్థులు సైనికుల్లా మారాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడుతుంటే అడ్డుకోవాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాజనీతి శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌దాస్ విద్యార్థుల చేత డ్రగ్ అడక్షన్ ఫ్రీ ఇండియాపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రెడ్ క్రాస్ యూనిట్ రుద్రేశ్, ప్రొఫెసర్ గౌరీమాణిక్ మానస్, సోషల్ సైన్సెస్ ఇన్‌స్టిట్యూట్ డీన్ డాక్టర్ కృష్ణభరద్వాజ్, డీన్ ఆఫ్ లా ఇన్‌స్టిట్యూట్ ప్రొపెసర్ మారన్న, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వీరేంద్రకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కుమార్, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రమేష్‌బాబు



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

హెచ్‌ఐవీపై యువతకు అవగాహన ఉండాలి

డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, ఆగస్టు 12: హెచ్‌ఐవీపై యువత అవగాహన కలిగివుండాలని డీహెచ్‌ఓ రమేష్‌బాబు అన్నారు. ఎయిడ్స్ నివారణ సంఘం బెంగళూరు, జిల్లా యంత్రాంగం, పంచాయతీ, ఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ, ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం మేధా గ్రాడ్యుయేట్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత జీవితంలో స్థిరపడాలన్న సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. దేశ భవిష్యత్తుకు యువత చేయిచేయి కలపాలని సూచించారు. హెచ్‌ఐవీ మరణాలు సంభవించకుండా ఉండేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఇందుకోసం జిల్లా, తాలూకాల్లోని ప్రధాన కూడళ్లల్లో డ్యాన్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా ఎయిడ్స్ నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ బాధితులు వాడిన సూదులు, సిరంజీలు, సెక్స్, రక్తాన్ని స్వీకరించడం ద్వారా హెచ్‌ఐవీ సోకుతుందన్నారు. హెచ్‌ఐవీబారిన పడకుండా యువత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మీడియా, ఆరోగ్యశాఖ ద్వారా అవగాహన పెంచాలని కోరారు. అనంతరం హెచ్‌ఐవీపై నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ప్రొఫెసర్ మంజునాథ్, జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, సైకాలజిస్ట్ డాక్టర్ రోహన్ వనగుండి, ఈశ్వర్ దాసప్పనవర్, గిరీస్, హొన్నూరప్ప, జగదీశ్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

కంప్లి, ఆగస్టు 12: ఉలిగమ్మ దేవస్థానం నది ఒడ్డున స్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని దేవదాయ, పోలీసు శాఖలు హెచ్చరించాయి. జలాశయం నుంచి అత్యధికస్థాయిలో నీరు రావడంతో స్నానం చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నదిఒడ్డున స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకోవాలన్నారు. నదిలోకి ప్రవేశించరాదన్నారు. ఇప్పటికే నది వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా దేవదాయ, పోలీసుశాఖలకు చెందిన సిబ్బందిని అక్కడ ఉంచి నదిలోకి ఎవరూ ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నారు.



ఉలిగమ్మ దేవస్థానం వద్ద నది సమీపానికి భక్తులు వెళ్లరాదని హెచ్చరికలు జారీచేస్తున్న పోలీసు శాఖ

దేవదుర్గ సీఐపై సస్పెన్షన్ వేటు

ఉత్తర్వులు జారీచేసిన బళ్లారి ఐజీపీ

రాయచూరు, ఆగస్టు 12: అక్రమ రవాణాలో పట్టుబడిన ఇసుక పోలీస్‌స్టేషన్ వద్దనే మాయం కావడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఈ అంశం గడచిన రెండు రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతూ వచ్చింది. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ, డీఎస్పీతో కలిసి శాఖ పరమైన విచారణ నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్పీ ఇచ్చిన నివేదిక ఆధారంగా దేవదుర్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ సదలగినిని సస్పెండ్‌చేస్తూ బళ్లారి ఐజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవదుర్గ పోలీస్ స్టేషన్ వద్ద దాదాపు 128 మెట్రిక్ టన్నుల అక్రమ ఇసుకను డంప్ చేసి ఉండగా ఆ ఇసుక మొత్తం అక్రమంగా రవాణా జరిగినదేనని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో మూడు నాలుగు రోజుల క్రితం ఇసుక మొత్తం పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి మాయం కావడంతో ఒక్కసారిగా విషయం వెలుగు చూసింది. దీనిపై జరిపిన శాఖాపరమైన విచారణలో బాధ్యుడిగా గుర్తించిన దేవదుర్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ సదలగిని పై సస్పెన్షన్ వేటు పడింది.

రాయచూరు ప్యాసింజరు రద్దు

గుంతకల్లు, ఆగస్టు 12: ప్రయాణికుల ఆక్యుపెన్సీ లేని కారణంగా గుంతకల్లు-రాయచూరు-గుంతకల్లు (నంబరు 07729/30) ప్రత్యేక రైలును రద్దు చేశామని రైల్వే అధికారులు సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలును ఐదు రోజుల కిందట గత బుధవారం ప్రారంభించారు. కానీ ప్రయాణికుల ఆదరణ లేని కారణంగా ఈ రైలును మంగళవారం నుంచి రద్దుపరచినట్లు తెలియజేశారు.

రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

రైతుసంఘం రాష్ట్ర నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 12: తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడంతో ఒక పంట కూడా సాగుచేయడం కష్టమవుతుందని, ఈ నేపథ్యంలో రైతులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రభుత్వం రైతులకు ప్రకటించాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హరితసేన అధ్యక్షుడు వాసుదేవ్ మేటి డిమాండ్ చేశారు. సోమవారం హొసపేట నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం ఉపశమన ప్యాకేజీని అందించాలన్నారు. ఉత్తర కర్ణాటకలోని డ్యాంల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గేటు కొట్టుకుపోవడంతో అధికారులను మాత్రమే నిందించడం సరికాదని, ప్రభుత్వ బాధ్యత కూడా ఉంటుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆ స్థలానికి రాలేదంటే ప్రభుత్వ పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. కేఆర్‌ఎస్ డ్యాం వద్ద ఇలాంటి విపత్తు జరిగి ఉంటే ప్రభుత్వమంతా అక్కడే ఉండేది. కానీ ప్రభుత్వం తుంగభద్రను పట్టించుకోవడం లేదన్నారు. డీసీఎం డీకే శివకుమార్ అరగంట మాత్రమే ఉన్నారని, వారం రోజుల్లోగా కొట్టుకుపోయిన గేట్‌ను మళ్లీ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఉగ్రపోరాటాలు తప్పవని హెచ్చరించారు.

కొత్త నిబంధనలపై నిరసన



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 12: కొత్త నిబంధనల అమలుపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిరసన తెలిపాయి. సోమవారం బళ్లారి అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు మరిస్వామిరెడ్డి మాట్లాడుతూ కొత్త నిబంధనల అమలు సరికాదన్నారు. రెవెన్యూ, అగ్నిమాపక, స్త్రీశిశుశాఖల నుంచి రెన్యూవల్ పొందాలనేది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదేవిధంగా ఏటా రెన్యూవల్‌కు రూ. 5లక్షలు చెల్లించాలనడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందించలేదన్నారు. ఈనేపథ్యంలో ఆగస్టు 15న నిరసన తెలుపుతున్నామన్నారు. సమావేశంలో కోశాధికారి పీ రంజాన్, యూనియన్ కార్యదర్శి రిజ్వాన్, రంగస్వామి, మల్లికార్జున, హనుమంతప్ప, పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఆయకట్టుదారులపై చర్యలు తీసుకోండి



టెక్కలికోట పోలీస్ స్టేషన్‌లో సమావేశమైన రైతులు

సిరుగుప్ప, ఆగస్టు 12: అక్రమ ఆయకట్టుదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. టెక్కలకోట పట్టణంలో సీఐ సుందరేష్ ఆధ్వర్యంలో రైతులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగవడే కాలువ పైభాగంలోని సిరిగేరి, దాసాపురం తదితర ప్రాంతాల్లో అక్రమంగా ఆయకట్టు సాగుచేస్తున్నారని, దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడంలేదన్నారు. అక్రమ ఆయకట్టు సాగుపై ప్రభుత్వం నామమాత్రంగా చర్యలు తీసుకోవడం సరికాదని రైతు మణికప్ప అన్నారు. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు మద్దతుగా వుంటే అక్రమ ఆయకట్టుదారులపై చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ జేఈ రైతులకు హామీ ఇచ్చారు. అక్రమ ఆయకట్టుదారులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సుందరేష్ తెలిపారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి: ఏఐయూవైఎస్‌సీ



కలెక్టరేట్ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న ఏఐయూవైఎస్‌సీ నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 12: ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారత నిరుద్యోగ యువజన పోరాట సమితి (ఏఐయూవైఎస్‌సీ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు పద్ధతికి స్వస్తిపలకాలన్నారు. నిరుద్యోగులకు శాశ్వతప్రాతిపదికన ఉపాధి కల్పించాలన్నారు. లేనిపక్షంలో నిరుద్యోగభృతి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ప్రధాని, ముఖ్యమంత్రికి వినతిపత్రాలను జిల్లా కలెక్టరేట్ సిబ్బంది ద్వారా సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జగదీశ్ నేమకల్, పంపాపతి, నాయకులు పాల్గొన్నారు.

'అభివృద్ధిలో రాజీవ్‌గాంధీ పాత్ర మరువలేనిది'



రాజీవ్ సద్భావన యాత్రను స్వాగతిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాయచూరు, ఆగస్టు 12: సుపరిపాలనను అందించడంతోపాటు ప్రభుత్వం నిర్దేశించుకున్న సంక్షేమ ఫలాలు సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు చేరాలని సంకల్పించిన రాజీవ్ గాంధీ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని డీసీసీ అధ్యక్షుడు బసవరాజ ఇటగి అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమై 80 ఏళ్లు పూర్తైన సందర్భంగా రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని చేపట్టిన రాజీవ్ సద్భావన యాత్ర సోమవారం నగరానికి చేరింది. యాత్రకు నగరశివారులో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక వీరశైవ కల్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో సాంకేతికతను ప్రవేశపెట్టిన రాజీవ్ గాంధీ సుపరిపాలనకు ఆద్యుడన్నారు. రాజీవ్ గాంధీ చేసిన పలు సంస్కరణలు నేడు దేశంలో పరిపాలనకు మూలస్తంభాలుగా నిలిచాయన్నారు.

రంగనాథన్‌కు ఘననివాళి

బళ్లారి సిటీ, ఆగస్టు 12: జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ రంగనాథన్‌కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఘనంగా నివాళులు అర్పించారు. రంగనాథన్ చిత్రపటానికి చాన్స్‌లర్ తిప్పేరుద్రప్ప పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చాన్స్‌లర్ రుద్రేష్, లైబ్రేరియన్ మారన్న తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కరుణానిధి శతజయంతి



కరుణానిధి శత జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు

హోసూరు, ఆగస్టు 12: కృష్ణగిరి జిల్లా డీఎంకే తరపున కరుణానిధి శత జయంతి వేడుకలు హోసూరు రైతు బజారులో ఎన్విరాన్‌మెంట్ టీమ్ జిల్లా ఆర్గనైజర్ మాణిక్య వాసకం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైతు బజారులో రైతులు, స్థానికులకు 2000 విలువైన పసుపు సంచులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి వైప్రకాశ్, మేయర్ సత్య, రాష్ట్ర ఉప కార్యదర్శి ఎన్విరాన్‌మెంట్ టీమ్ డాక్టర్ సెంథిల్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు యువరాజ్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి, డివిజన్ కార్యదర్శి రాము, హెల్త్ కమిటీ అధ్యక్షుడు మాదేశ్వరన్, చిన్నీరప్ప, మత్తిగిరి రవికుమార్, కరుణానిధి, నిసార్ టీం నిర్వాహకులు సుమన్, కన్నన్, శక్తివేల్, రాజా, మునిరాజ్, శాంతి, చంద్రన్, గౌరి ఉన్నారు. కార్యక్రమంల్లో గురునాథన్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై అవగాహన

హోసూరు ఆగస్టు 12: తమిళనాడు ప్రభుత్వం తరపున తమిళనాడువ్యాప్తంగా డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి చెన్నైల్లో ప్రారంభించారు. తమిళనాడు ప్రభుత్వం పోలీసు శాఖ తరపున హోసూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో 'డ్రగ్స్ ఫ్రీ' తమిళనాడు ప్రతిజ్ఞ విద్యార్థుల డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అవగాహన ర్యాలీని హోసూరు ఎమ్మెల్యే వైప్రకాశ్ ప్రారంభించారు. ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల గుండా తిరిగి పాఠశాల వద్ద ముగిసింది. కార్యక్రమంలో మేయర్ సత్య, డీఎస్పీ బాబు ప్రసాంత్, జిల్లా విద్యాశాఖాధికారి శివరామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునిరాజ్ స్వాగతం పలికారు, పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సెంథిల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పేరెంట్స్ టీచర్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్‌లు శక్తివేల్, శ్రీధర్, పార్లమెంట్ సభ్యుడు మోసిన్ తాజ్ నిసార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నాగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు




అమ్మవారి విగ్రహాన్ని తలపై ఉంచుకుని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తుడు జగన్

హోసూరు, ఆగస్టు 12: హోసూరులోని శ్రీనాగమ్మ ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. 17వ వార్షిక ఉత్సవాల్లో భక్తులు కరగం మోసుకుని అమ్మవారి పూజలు చేశారు. ప్రసిద్ధ శ్రీ నాగమ్మ దేవాలయం చిన్న యళసగిరి, కామరాజర్ నగర్ ప్రాంతంల్లో ప్రతి సంవత్సరం ఆడి మాసంలో ఈ ఉత్సవం జరుగుతుంది. 17వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. పుణ్యస్నానం ఆచరించి పాదపూజలు చేసి ఉపవాస దీక్ష స్వీకరించి భక్తిశ్రద్ధలతో అమ్మవారి కరగం తీసుకుని తలపై ఉంచి ఊరేగింపుగా మేళతాళాల నడుమ ప్రధాన వీధులగుండా తీసుకెళ్లారు. ఓం శక్తి పరాశక్తి అంటూ తీసుకెళ్లారు. అనంతరం అమ్మవారికి మహాశాంతి ఆరాధన నిర్వహించి ప్రత్యేక మంగళ హారతి ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఫిడెల్ కాస్ట్రో (జయంతి)



క్యూబా దేశానికి చెందిన ఫిడెల్ కాస్ట్రో 1926 ఆగస్టు 13న జన్మించారు. క్యూబా దేశాన్ని 1959 నుంచి 2008 వరకు పరిపాలించిన అరుదైన రాజకీయ నేతగా, విప్లవ నాయకుడిగా గుర్తింపు పొందారు. క్యూబాను పశ్చిమార్థ భూగోళంలో మొట్టమొదటి సామ్యవాద దేశంగా మార్చాడు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబాకు తొలి కార్యదర్శి. తన పాలనలో సామాజిక, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చాడు. నెల్సన్ మండేలా వాటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాడు. కాగా ఇతను అమెరికా దేశానికి వ్యతిరేకి. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ కాస్ట్రోను హత్య చేయడానికి మొత్తం 638 సార్లు విఫలయత్నం చేసింది. 2016 నవంబరు 15న కన్నుమూశారు.

ఎస్ వరలక్ష్మి (జయంతి)



అలనాటి నటీమణి ఎస్ వరలక్ష్మి 1937 ఆగస్టు 13న జగ్గంపేటలో జన్మించారు. సత్యహరిశ్చంద్రలో చంద్రమతిగా, లవకుశలో భూదేవిగా ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. తన పాత్రకు తానే పాటలు పాడుకునే ఆమె కంఠస్వరం పాతతరం ప్రేక్షకులకు సుపరిచితమే. తెలుగు సహా వీరపాండ్య కట్టబొమ్మన్, పణమా పాశమా, గుణ వంటి తమిళ సినిమాల్లో నటించారు. ప్రముఖ నిర్మాత ఏఎల్ శ్రీనివాసన్‌ను పెళ్లాడారు. కన్నాంబ ప్రోత్సాహంతో 1957లో సతీ సావిత్రి నిర్మించింది. సుమారు 500 సినిమాలలో నటించిన ఆమె కళై మామణి, శివాజీ గణేశన్ మెమోరియల్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2009 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

శ్రీదేవి (జయంతి)



'తొలి ఫిమేల్ సూపర్‌స్టార్'గా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత శ్రీదేవి 1963 ఆగస్టు 13న మద్రాస్‌లో జన్మించారు. తెలుగు, కన్నడ, తమిళం, మళయాళం, హిందీ భాషలలో నటించి గుర్తింపు పొందారు. అందం, అభినయం, నటనతో 1980, 90 దశకాలలో అగ్రశ్రేణి కథానాయికగా రాణించారు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, నంది అవార్డు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డు, తమిళనాడు స్టేట్, కేరళ స్టేట్ అవార్డులు అందుకున్నారు. వరుసగా 15 సంవత్సరాలు బాక్సాఫీస్ రికార్డు సాధించిన ఘనత ఉంది. నిర్మాత బోనీకపూర్‌ను వివాహమాడారు. 54వ యేట 2018 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

టీకే మూర్తి (పుట్టినరోజు)



థాను కృష్ణమూర్తి 1922 ఆగస్టు 13న కేరళ రాష్ట్రంలోని నయతంగరై గ్రామంలో జన్మించారు. ఎటువంటి శిక్షణ లేకుండా 8వ యేటనే మృదంగ వాద్యంపై ప్రతిభ చాటారు. 15వేలకు పైగా కచేరీలలో మృదంగంపై సహకారం అందించారు. త్రివేండ్రం ప్యాలెస్‌కు ఆస్థాన విద్వాన్‌గా వ్యవహరించారు. పద్మశ్రీ, సంగీత కళానిధి, కేంద్ర సంగీత నాటక అకాడమీ వారి ఫెలోషిప్ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. ప్రసారభారతిలో జాతీయ కళా కారుడిగా కొనసాగారు.

వైజయంతి మాల (పుట్టినరోజు)



వైజయంతిమాల పాతతరం తెలుగు, తమిళ సినిమా నటి 1936 ఆగస్టు 13న చెన్నైలో జన్మించారు. హిందీ చిత్రరంగంలో ప్రవేశించి మంచి పేరు పొందారు. భరతనాట్య కళాకారిణిగాను, గోల్ఫ్ క్రీడాకారిణాగాను రాణించారు. 1950, 60 దశకాలలో పలు సినిమాలలో నటించి అనేక అవార్డులు పొందారు. తర్వాత పార్లమెంటు సభ్యురాలిగాను కొనసాగారు. సంగీత నాటక అకాడమీ, పద్మశ్రీ పురస్కారం, 5 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు అందుకున్నారు.

సాత్విక్ సాయిరాజ్ (పుట్టినరోజు)



వర్ధమాన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి 2000 ఆగస్టు 13న అమలాపురంలో జన్మించారు. పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టితో సత్తా చాటాడు. కామన్వెల్త్ 2018లో మిక్స్‌డ్ టీమ్‌లోనూ, 2022 కామన్వెల్త్‌లో పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించాడు. 2023 దుబాయ్‌లో ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో స్వర్ణపతకం సాధించారు. అర్జున అవార్డు, ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న సహా ఇతర గౌరవాలు అందుకున్నారు.

పంపకాల్లో తేడా.. దొరికిన దొంగలు

బత్తలపల్లి, ఆగస్టు 12: చోరీ చేసిన సొత్తు పంపకాల్లో తేడాల కారణంగా ఘర్షణపడి ముగ్గురు మహిళలు పట్టుబడ్డారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన మోహన్ భార్య రాధమ్మ బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలోని బంధువుల ఇంటికి రెండ్రోజుల క్రితం వచ్చింది. సోమవారం ధర్మవరం వెళ్లి, చీరలు కొనుగోలు చేసింది. అక్కడి నుంచి బత్తలపల్లికి బస్సులో వచ్చింది. బస్సు దిగాక తన మెడలోని 20 తులాల బంగారు నగలను తీసి, బ్యాగులో పెట్టుకుంది. మడుగుపల్లి వెళ్లేందుకు నార్పల బస్సు ఎక్కింది. బస్సులో ముగ్గురు మహిళలు.. ఆమెను మాటల్లో పెట్టారు. ఆమె దృష్టి మరల్చి బ్యాగులోని బంగారాన్ని కొట్టేశారు. మాల్యవంతం గ్రామంలో ఆ ముగ్గురు మహిళలు బస్సు దిగి, వెళ్లిపోయారు. బస్సు తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లికి చేరుకున్నాక రాధమ్మ.. తన బ్యాగులోని బంగారాన్ని చూసుకోగా.. కనిపించలేదు. ఆమె బోరున విలపిస్తూ విషయం బస్సు డ్రైవర్‌కు తెలిపింది. వెంటనే బస్సు ఆపి రాధమ్మ అక్కడే దిగేసింది. నార్పల వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడిని ఆపి, విషయం తెలిసింది. అతడు.. ఆమెను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని మాల్యవంతంలో దిగిన మహిళల గురించి ఆరాతీయగా.. వారు బత్తలపల్లి వైపు ఆటోలో వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. అక్కడి నుంచి బత్తలపల్లికి చేరుకున్నారు. గ్రామ శివార్లలోని నర్సరీల వద్ద ముగ్గురు మహిళలు బంగారు పంచుకోవడంలో తేడా రావడంతో పరస్పరం దాడి చేసుకుంటున్నారు. అటుగా వెళ్తున్నవారు పోలీసులకు సమాచారం అందించారు. అంతలోనే బాధిత మహిళ రాధమ్మ.. ఆ మహిళలను గుర్తించి, వారివద్దకు వెళ్లి వాదిస్తుండగా పోలీసులు అక్కడకు చేరుకుని, విచారించారు. మహిళా దొంగలను స్టేషన్‌కు తరలించి, చోరీ చేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహిళలను విచారించగా.. సరైన సమాధానం ఇవ్వడంలేదని తెలుస్తోంది.

ఆడంబరంగా మైసూరు దసరా

▸▸ హైపవర్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది ఉత్తమ వర్షాలు కురిసిన తరుణంలో నాడహబ్బ మైసూరు దసరా ఆడంబరంగా నిర్వహిద్దామని ముఖ్య మంత్రి సిద్ద రామయ్య తెలిపారు. సోమవారం విధానసౌధలో మైసూరు దసరా ఉత్సవాలకు సంబంధించి హైపవర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వరుసగా రెండేళ్ల కొవిడ్, ఆ తర్వాత కరువుతో దసరా ఉత్సవాలు సాధారణంగా ముగించామని, ఈ ఏడాది వేడుకలు ఆడంబరంగా చేద్దామని తెలిపారు. గత ఏడాది రూ.30 కోట్లు విడుదల చేశామని, ఈసారి దసరాకు మరింత ఎక్కువ నిధులు కేటాయిద్దామన్నారు. జంబూసవారిలో శకటాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అక్టోబరు 3న చాముండి కొండపై దసరా ఉత్సవాన్ని ప్రారంభించాలని తీర్మానించారు. ఈనెల 21న హుణసూరు తాలూకా వీరనహొసహళ్లిలో ఏనుగులకు పూజలు చేసి స్వాగతిస్తామన్నారు. అక్టోబరు 3నుంచి 12వరకు దసరా ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. టూరిస్ట్ మిత్రతోపాటు పలు ప్రత్యేక సౌలభ్యాలు తీసుకురాదలిచామన్నారు. దీపాలంకరణ 21 రోజులు కొనసాగిస్తామని అన్నారు. కర్ణాటక సంభ్రమ 50 కొనసాగుతున్న తరుణంలో మరింత ఆకర్షణీయం చేద్దామని అన్నారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చలు జరిపి ఎయిర్‌షో ఏర్పాట్లు చేద్దామని తెలిపారు. మంత్రులు మహదేవప్ప, జార్జ్, హెచ్‌కే పాటిల్, వెంకటేశ్, మండ్య, మైసూరు, చామరాజనగర జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



హైపవర్ కమిటీ సమావేశంలో సీఎం సిద్దరామయ్య తదితరులు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసన

దొమ్మసంద్ర, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై నిరంతరంగా దౌర్జన్యాలు, దాడులు కొనసాగడాన్ని ఖండిస్తూ హిందూ సంఘాలు, స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో సంయుక్తంగా సోమవారం దివిటీలతో నిరసన తెలిపారు. హిందువుల రక్షణకు కేంద్రం చొరవ చూపాలని కోరారు. ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామంలోని బస్టాండ్ నుంచి సంతవీధి, ముత్యాలమ్మ దేవస్థాన వీధి, తేరువీధి మీదుగా ర్యాలీ సాగింది. వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లోని ముస్లింలు హిందువుల మహిళలు, బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డం దారుణమన్నారు. హిందూధర్మాన్ని నిర్మూలించే కుట్రకు పాల్పడ్డారని దొమ్మసంద్ర గ్రామానికి జయణ్ణ, రవీంద్ర, భరత్ గౌడలు ఆరోపించారు. ఆనేకల్ తాలూకా పంచాయతీ మాజీ సభ్యులు రవీంద్ర, మురళీ, దర్, వేణుగోపాల్, ప్రసన్న కుమార్, జగదీశ్ రుద్రప్ప, పలు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దివిటీలతో నిరసన ఇలా..

ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం: మంత్రి



మంత్రిని సన్మానిస్తున్న ఆలయ పదాధికారులు

శిడ్లఘట్ట, ఆగస్టు 12: తాలూకాలో ప్రముఖమైన భూనీళా సమేత వెంకటరమణ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కెహెచ్ మునియప్ప వెల్లడించారు. రెండురోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో మంత్రి పాల్గొనగా ఆలయ కమిటీ మంత్రిని ఆత్మీయంగా సత్కరించింది. ఆలయ అభివృద్ధి గురించి కమిటీ పదాధికారులు చర్చించగా మంత్రి సానుకూలంగా స్పందించారు. చారిత్రాత్మక ఆలయాన్ని భక్తులు రోజురోజుకు పెరుగుతున్నారన్నారు. దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డితో చర్చించానని, ఆలయ అభివృద్ధికి గ్రాంటు సాధించేయత్నం చేస్తానని ఇందుకు దాతలు కూడా సహకరించాలని కోరారు. ఆలయ అభివృద్ధి చేసిన అనంతరం రెండో విడతలో మరింత దృష్టి సారించనున్నట్టు తెలిపారు. ఆలయానికి సంబంధించి వంద ఎకరాల స్థలం ఉందని దీన్ని ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చిదలిచామన్నారు. ఆలయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డి.పి.నాగరాజ్ మాట్లాడుతూ జిల్లాలో ధార్మిక కేంద్రాలలో ఒకటైన ఈ ఆలయానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ సహా అనేక రాష్ట్రాలనుంచి భక్తులు వస్తుంటారన్నారు. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో వేలాదిమంది స్వామిని దర్శించుకుంటారని, ఆలయ అభివృద్ధికి స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.ఎన్.స్వామి, ఆలయానికి చెందిన రాయప్పనహళ్ళికి చెందిన అశ్వత్ నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాధమ్మ, గోపాలరెడ్డి, రవి, మంజుళ, పాండురంగ, డివి శ్రీరంగప్ప, సాదలి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ మహాసభ అధ్యక్షుడిగా శంకర్ బిదరి

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వీరశైవ మహాసభ అధ్యక్షుడిగా మాజీ డీజీపీ శంకర్ బిదరి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరశైవ మహాసభ రాష్ట్రంలో కీలకమైనది. వీరశైవ లింగాయతలు సుమారు 150 శాసనసభ నియోజకవర్గాలలో అభ్యర్థుల భవిష్యత్తును నిర్ధారించే నిర్ణయాత్మకపాత్ర పోషిస్తారు. నామినేషన్ల దాఖలులో మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, జాతీయ కార్యదర్శి రేణుకా ప్రసన్నతోపాటు పలువురు పాల్గొన్నారు. మహాసభలో 31వేలమంది సభ్యులు ఉన్నారు. శంకర్‌బిదరి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ఆదివారం ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పణ్ణ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు కొత్త అధ్యక్షుడు శంకర్‌బిదరి మాట్లాడుతూ మద్దతు ఇచ్చిన సమాజంలోని అందరినీ కలుపుకొని పనిచేస్తానన్నారు. శంకర్‌బిదరి నైతికత, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు. గంధపుచెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను కట్టడి చేసే విషయంలో ఎంతోమంది ఐపీఎస్‌లు వెనుకడుగు వేశారు. కానీ శంకర్‌బిదరి మాత్రం ధీటుగా ఎదుర్కొన్నారనే పేరు సాధించారు.

ఉపాధి హామీ పథకంతో ఆర్థిక భద్రత



గ్రామసభలో ఉపాధిహామీ గ్రామస్థులతో చర్చిస్తున్న అధికారులు

బంగారపేట, ఆగస్టు 12: ఉపాధి హామీ పథకం కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతి ష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలలో ఒకటని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక భద్రత పొందాలని నోడల్ అధికారి మునిరాజు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బూదికోటె గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. గత ఏడాదిలో నరేగా కింద చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, పూర్తైన కార్యక్రమాలు, వాటి ఖర్చు గురించి ఏడురోజులపాటు శ్రమించి ఒక నివేదికను సిద్ధం చేసి గ్రామపెద్దల సమక్షంలో చర్చలు జరిపారు. ఆడిటర్ ఆయేషాసుల్తాన్ మాట్లాడుతూ సోషల్ ఆడిట్ ఉద్దేశ్యం, గ్రాంట్లు, ఖర్చు గురించి వివరించారు. ఆడిట్‌లో కొన్ని పొరపాట్లు ఉన్నాయని సరిదిద్దామన్నారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఆర్ మంజునాథ్ మాట్లాడుతూ 99శాతం పనులు నాణ్యత ఉన్నాయన్నారు. సమావేశంలో గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు చంద్రప్ప, పీడీఓ కిశోర్ కుమార్, కార్యదర్శి మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

బోయింగ్ సంస్థ సహకారంతో శిశుమందిర పాఠశాల నిర్మాణం

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శిశుమందిర పాఠశాల నిర్మాణంకు బోయింగ్ ఇండియా సంస్థ సహకరించింది. బోయింగ్ కంపెనీ 6వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో పాఠశాలను నిర్మించారు. సంస్థ గ్లోబల్ సర్వీస్ చైర్మన్ క్రిస్ రేమండ్, శిశుమందిర ఫౌండర్ హెల్లాముంద్రాలు పాల్గొన్నారు. క్రిస్ రేమండ్ మాట్లాడుతూ బోయింగ్ సామాజిక కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు అవసరమైన సౌలభ్యాలు, నిర్మాణాలను సమకూరుస్తున్నామన్నారు. 2014లో శిశుమందిర సంస్థతో ఒప్పందం చేసుకున్నామని అందుకు అనుగుణంగా నిర్మాణాలు జరిపామన్నారు.



భవనం ప్రారంభంలో సంస్థ ప్రముఖులు

ఏఐతో గృహోపకరణాలు

బెంగళూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గృహోప కరణాల తోపాటు వివిధ విభాగాల్లో ప్రముఖ సంస్థ గోద్రెజ్ ఏఐ టెక్నాలజీకి అనుగుణంగా పలు వస్తువులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ కమల్ నంది వెల్లడించారు. ఏఐ టెక్నాలజీతో రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్‌లో వివిధ కేడర్‌లలో ఉత్పత్తులు మార్కెట్‌లోకి తెచ్చామన్నారు. 2.5 టీఆర్ ఏసీలను పరిచయం చేస్తున్నా మన్నారు. ఏఐ సాంకేతికతకు అనుగుణంగా మార్కెట్‌లోకి తెచ్చిన ఉత్పత్తులకు వారెంటీతోపాటు ఈఎంఐ సౌలభ్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ ఏడాది తొలి త్రైమా సికంలో 40శాతం విక్రయాల ప్రగతి సాధ్యమైందని, పం డుగల సీజన్‌లో అన్నివర్గాలకు అనుగుణమైన ఉత్పత్తులు అందుబాటులోకి తెచ్చామన్నారు.

లైబ్రేరియన్ సుభాష్‌రెడ్డికి రోటరీ పురస్కారం

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఈఎస్ యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ సుభాష్‌రెడ్డికి రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ పురస్కారంతో సత్కరించారు. సోమవారం జరిగిన సమావేశంలో రోటరీ ప్రతినిధులు సుభాష్ రెడ్డికి ప్రత్యేకంగా సన్మానించారు. పురస్కార గ్రహీతలను పలువురు అభినందించారు.



లైబ్రేరియన్లకు సన్మానం

అసంబద్ధ సర్దుబాట్ల ప్రక్రియ ఆపాలి

- ఫ్యాప్టో నాయకుల డిమాండ్
- కౌన్సెలింగ్ బహిష్కరణ



పురంలో ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 12: ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ అసంబద్ధ సర్దుబాట్లను వెంటనే నిలిపివేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తోందని ఆగ్రహించారు. జీఓ నంబర్117ను రద్దు చేయాల్సిందిపోయి.. అలానే కొనసాగించేలా ప్రవర్తించడం సరికాదన్నారు. జీఓ ఎంఎస్ 53 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. దాదాపు 18 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓకు అందించారు. ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, నాగరాజు, నారాయణస్వామి, ఆదినారాయణ, యూటీఎఫ్ నాయకులు బాబు, చెన్నకేశవ, ఎస్‌టియూ శ్రీనివాసులు, గోపాల్, సమీవుల్లా, మునిసి పల్ టీచర్స్ నాయకుడు సిద్దగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: ఫ్యాప్టో నాయకులు ప్రస్తుత ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియను వ్యతిరేకిస్తూ, ఉపాధ్యాయ సమస్యలపై పలు డిమాండ్లతో కూ డిన వినతి పత్రాన్ని సోమవారం స్థానిక ఎమ్మార్వీ కార్యాల యంలో ఎంఈఓ సుధాకర్‌కు అందజేశారు. ఫ్యాప్టో చైర్మన్ కోదూరు శ్రీనివాసులు, కోచైర్మన్ సుధాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కాడిశెట్టి శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, అమర, కరణం రఘునాథ్‌బాబు పాల్గొన్నారు.

హిందూపురం(సోమందేపల్లి): తాత్కాలిక ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో పిలుపు మేరకు సోమవారం ఉపాధ్యాయులు కౌన్సి లింగ్‌ను బహిష్కరించారు. వివిధ డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ ఆంజనేయులు నాయక్‌కు వినతిపత్రం అందించారు.

మడకశిరటౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటును బాయ్‌కాట్ చేస్తున్నట్లు సోమవారం ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ శ్రీనివాసభాస్కర్‌కు అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు భూతన్న, జోగప్ప, చంద్రమోహన్, రామకృష్ణ, మహంతేష్, వెంకటరాముడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు నేడు జరుగుతున్న అసంబద్ధ, అశాస్త్రీయ ఉపాధ్యాయ పని సర్దుబాటును వ్యతిరేకిస్తున్నట్లు మండల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్వీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పలు డిమాండ్లతో మండల విద్యాశాఖాధికారులు మోహన్, శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జోన్ ఉపాధ్య క్షుడు యంజేరప్ప, మండల అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తా

▸▸ బీజేపీ టిక్కెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా బరిలోకి..

▸▸ ఢిల్లీ వెళ్లే ముందు సీపీ యోగేశ్వర్

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నానని, పార్టీ టిక్కెట్ దక్కకపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని బీజేపీ ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ తెలిపారు. బీజేపీ పెద్దల సూచన మేరకు ఢిల్లీ వెళ్లే ముందు బెంగళూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చెన్నపట్టణ నుంచి పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు. బీజేపీ టిక్కెట్ ఇస్తుందని భావిస్తున్నానని, సాధ్యం కాకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొంది ఎన్డీయేలో భాగస్వామిని అవుతా అన్నారు. నియోజకవర్గ ప్రజలు తనపై విశ్వాసంతో ఉన్నారని, గుర్తు ఏదైనా తాను గెలుస్తాననే నమ్మకం ఉందన్నారు. ఢిల్లీలో అగ్రనేతలను కలిసేందుకు వెళ్తున్నా అన్నారు. ఈనెల 16న మరోసారి వెళ్తానని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరే ఆలోచన లేదని, ఎవరూ తనతో మాట్లాడలేదని అన్నారు. డీకే శివకుమార్ ఏం మాట్లాడారనేది ఆయన వ్యక్తిగతమన్నారు. తనకు కుమారస్వామితో భేదాభిప్రాయాలు లేవని, కానీ డీకే శివకుమార్ తెరపైకి తెస్తున్నారని అన్నారు. కుమారస్వామి అంగీకరించకుంటే తన భవిష్యత్తు తాను చూసుకుంటా అన్నారు.

వీర సారథ్యంలో 'లవ్ గేమ్స్'



దర్శక నిర్మాత వీర

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దర్శక నిర్మాపకత్వంతో పాటు ఛాయా గ్రాహకుడిగా అనుభవం కల్గిన వీర 'లవ్ గేమ్స్' సినిమాను రూపొందిస్తున్నారు. కన్నడ సినిమారంగంలో ఓ కొత్త ప్రయోగాన్ని చేస్తున్నారు. రిఫ్రెష్, రొమాంటిక్, హాస్యంతో సినిమా రూపొందించినట్లు వీర తెలిపారు. హాలీవుడ్‌లో సినిమాటోగ్రఫీలో శిక్షణ పొందానన్నారు. హాస్యం, ప్రణయం సమ్మిళితమైన సినిమా అన్ని వర్గాలను ఆకట్టుకోనుందన్నారు. సత్యం మహాలింగం సంగీత దర్శకత్వం వహించారన్నారు. 7 పాటలు ఉండగా అదనంగా సంగీతరాజీవ్ ప్రత్యేక ట్రాక్ మ్యూజిక్ కూడా ఉండనుందన్నారు.

విద్యాదానం గొప్పది

శిడ్లఘట్ట, ఆగస్టు 12: జగత్తులో విద్యాదానం, వైద్య దానం అన్నింటికంటే గొప్పవని వైద్యులను దేవుళ్లగా భావించే ధర్మం మనదని మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బెళ్ళూటి గేట్ సమీపానగల రిచ్‌మండ్ ఫెలోషిప్ సొసైటీ, ప్రగతి గ్రామీణ శాఖ ఆధ్వర్యంలో మూర్ఛ, మానసిక ఆరోగ్య చికిత్సా ఆసుపత్రి రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా మనోభావం పెరగాలని, ఇతరులకు చేతనైన సాయం అందించాలన్నారు. రాజకీయ నాయకులకు ప్రజాసేవకు ఓటర్లు అవకాశం కల్పిస్తే దాన్ని తమ సొంత అభివృద్ధికి వాడుకోరాదని, పరోపకారం చేసే సంస్థలకు చేయూత ఇవ్వాలని సమాజ హితానికి పాటుపడాల న్నారు. కార్యక్రమంలో దాతలు చంద్రశేఖర్‌రెడ్డి, సంస్థ అధ్యక్షుడు శ్రీకారంత్, మంజునాథ్‌రెడ్డి, డాక్టర్ వీణా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మునికెంపణ్ణ, భక్తరహళ్ళి ప్రతీశ్, బెళ్ళూటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసు నిందితుడిని హతమార్చిన ప్రత్యర్థులు



షమీర్ (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఓ హత్యకేసులో జైలు పాలై వారం రోజులకిందటే బెయిల్‌పై విడుదలై తల్లితోపాటు భోజనానికి హోటల్‌కు వచ్చినవేళ వెంటాడిన ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు. ఉళ్ళాళ కడప్పర నివాసి షమీర్ (35)ను ఆదివారం రాత్రి 11 గంటల వేళ హత్యచేశారు. షమీర్, తల్లి, కుటుంబ సభ్యులతో కారులో హోటల్‌కు వచ్చారు. కల్లాపులోని ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసి వెను తిరి గారు. కారును వెంబడించిన దుండగులు తల్వార్ లతో దాడికి యత్నించారు. ప్రమాదాన్ని గుర్తించిన షమీర్ కారు నుంచి దిగి పరుగులు తీయగా కళ్ళాపు జంక్షన్ నుంచి 500 మీటర్ల దూరంలోనే హతమార్చారు. విషయాన్ని షమీర్ కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకునేసరికి సందడి లేకుండాపోయింది. షమీర్ పరుగులు తీసినవైపే పోలీసులు వెళ్లగా కాస్తదూరంలోనే మృతదేహాన్ని గుర్తించారు. 2018లో రౌడీషీటర్ టార్గెట్ ఇలియాజ్‌ను జెప్పువి ప్రాంతంలోని ఫ్లాట్‌లో దావూద్, షమీర్, రియాజ్‌తో పాటు పలువురు హత్య చేశారు. ఈ కేసులో షమీర్ రెండో ఆరోపితుడిగా ఉన్నాడు. పాండేశ్వర చికెన్‌స్టాల్‌లో షూటౌట్‌తోపాటు దోపిడీలు తదితర 9 కేసులలో షమీర్ ఆరోపితుడిగా ఉన్నారు. రెండు రోజుల కిందటే జైలు నుంచి షమీర్ జైలునుంచి బయటకు వచ్చాడు. ఉళ్ళాళ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు రోజులు వానలు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 12: రానున్న ఐదు రోజులు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పలు చోట్ల కురిసే అవకాశం ఉందని రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.